

ప్రమిదలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



ఆకర్షణీయమైన దీపావళి ప్రమిదలు



దీపావళి.. వెలుగుల కేళి

- ప్రమిదలు.. విభిన్న రూపాలు
- ఆకట్టుకుంటున్న ఆకృతులు
- ఊపందుకున్న విక్రయాలు



వివిధ రూపాల్లో ప్రమిదలు



తులసికోట ఆకృతిలో

మరింత శోభ..



ఒకప్పుడు చిన్న మట్టి ప్రమిదలే అందుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు వివిధ రూపాల్లో ఎంతో ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. దీంతో దీపాలు వెలిగిస్తే ఇళ్లు మరింత ఆకర్షణీయంగా మెరిసిపోతుంది..

–ఉడా సునీత, గృహిణి. నడుపూరు



జైజై గణేశా



పెదగంట్యాడ : దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాల కేళిని, వెలుగుల వైభవాన్ని తీసుకొస్తుంది. ఈ దివ్వెల పండుగ కోసం ప్రమిదలు కూడా విభిన్న రూపాలతో, అందమైన ఆకృతులతో ఆకట్టుకుంటున్నాయి. ఒకప్పుడు దీపావళి అంటే టపాసుల సందడే గుర్తుకు వచ్చేది. వారం రోజుల ముందే పిల్లలు టపాసులు కొని వెలిగించి సందడి చేసేవారు. దీంతో ప్రతి ఇంటా పండగ వాతావరణం కనిపించేది. అయితే, మారిన కాలానుగుణంగా ప్రజల ఆలోచన విధానంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. టపాసులను కాల్చడం వల్ల కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందనే భావన బలంగా వ్యక్తమవుతోంది. దీంతో ప్రజలు మందుగుండు సామగ్రి కాల్చడంపై ఆసక్తి తగ్గించుకున్నారని చెప్పాలి. కేవలం దీపావళి రోజు మాత్రమే పిల్లల కోసం కొద్దిపాటి సామగ్రి కొని, టపాసులు కాల్చి పండుగను జరుపుకుంటున్నారు. పర్యావరణ ప్రేమికులు, విద్యావంతులు టపాసులకు దూరంగా ఉంటున్నారని చెప్పక తప్పదు.

దీపాలపై పెరిగిన ఆసక్తి

మందుగుండు సామగ్రి కాల్చడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని గ్రహించిన ప్రజలు, ఇప్పుడు దివ్వెల పండుగను దీపాలతోనే చేసుకుంటున్నారు. దీపాలను వెలిగించే ప్రమిదలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రమిదల తయారీదారులు కూడా కొనుగోలుదారులను ఆకట్టుకునేలా వినూత్నంగా సిద్ధం చేస్తున్నారు. సంప్రదాయానికి అనుగుణంగా సాంకేతికతను జోడిస్తూ, నేటి తరానికి నచ్చేలా వివిధ ఆకృతుల్లో ప్రమిదలను తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఆకృతులు

మట్టితో తయారు చేసే సంప్రదాయ ప్రమిదలతో పాటు పింగాణీ, గాజుతో తయారు చేసిన విభిన్నమైన ఆకృతులు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. లక్ష్మీగణపతి, కొబ్బరికాయ, కలశం, శంఖు చక్రం, గజవాహనం, తులసికోట తదితర రూపాల్లోని ప్రమిదలు ఆకర్షణీయంగా ఉన్నాయి. డిజైన్లను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. దీంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరోపక్క ఇళ్లను విద్యుత్ దీపాలతో కూడా అలంకరిస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రమిదలను మన రాష్ట్రంతో పాటు రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

ఎంప్లాయీస్, పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా అప్పలస్వామి



గాజువాక : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా తిప్పల అప్పలస్వామిని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు 87వ వార్డులో కోటి సంతకాల సేకరణ

కూర్మన్నపాలెం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా జీవీఎంసీ 87వ వార్డులో ఆదివారం గాంధీబొమ్మ సెంటర్‌లో సంతకాల సేకరణకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయకుమార్, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హాజరు కానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వార్డు అధ్యక్షుడు బి. గోవింద.. పార్టీ నాయకులు, అభిమానులను కోరారు.

స్వచ్ఛ విశాఖ ధ్యేయం కావాలి

అగనంపూడి: స్వచ్ఛాంధ్ర లక్ష్యం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని 85వ వార్డు టీడీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్ అన్నారు. 85వ వార్డు పెదమడక మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దడానికి జీవీఎంసీ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని కోరారు. స్వచ్ఛ భారత్ అవార్డుకు అగనంపూడి ఆస్పత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపిక కావడం సంతోషకరమని తెలిపారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ రాట



ఉత్సవ రాటను వేస్తున్న గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు మద్దాల అప్పారావు తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవాల రాటను ప్రతిష్ఠించారు. అనంతరం ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు మద్దాల అప్పారావు తెలిపారు. కార్తీక మసం నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆడారి శంకర్, కొణతాల మల్లేష్, దాడి వేణుగోపాల్, పిల్లా కుమార్, పార్థసారథి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

భక్తి సాధన పుస్తకావిష్కరణ



భక్తి సాధన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివ గణేశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో డి. కమలాదేవి రచించిన 'భక్తి సాధన' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధ్యాన కేంద్రం నిర్వాహకుడు మీసాల శివ గణేశ్వరరావు మాట్లాడుతూ ధ్యానం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, శ్వాసపై ధ్యాస ఉంచితే మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనిత, అప్పలరాజు, దేవిక, లక్ష్మి, వాణి, సత్యవతి, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు పీజీ విద్యార్థులు నేషనల్ క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచారు. రెండవ సంవత్సరం పీజీ విద్యార్థినులు డాక్టర్ డి. రమ్య, డాక్టర్ ఎ.కాత్యాయిని నేషనల్ క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలవడం వైద్య విభాగానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ కొనియాడారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో రమణాజి, హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక ఉల్లాసాన్ని నింపుతాయని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజి, ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బాలికల అండర్-14, అండర్-17 విభాగంలో రెండో రోజు క్రీడా పోటీలు నిర్వహించారు. మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో 9 పాఠశాలల నుంచి 220 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న డివిజన్ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జ్ భానోజీరావు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్రనాయుడు, బి. అన్నాజీరావు, ఎం. నిజాముద్దీన్, రవి శ్రావణి, సమీర్‌ఉన్నీసా, కన్నారావు, రాజ్‌కుమార్, మంగమ్మ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రజా సంఘాల వినతి



నవీన్‌రాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా వాల్తేరు సీనియర్ డివిజనల్ రైల్వే ఇంజినీర్ నవీన్‌రాజ్‌ను ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మరో అదనపు ప్లాట్‌ఫామ్ నిర్మించాలని, ప్లాట్‌ఫామ్ నాలుగు నుంచి ఎస్టీబీఎల్ వరకు ఉన్న రహదారిని విస్తరించి మరమ్మతులు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. అలాగే నూతన రహదారి నిర్మించాలని, కాపు జగ్గరాజుపేట వద్ద ఉన్న అండర్ బ్రిడ్జ్ సమస్యలు పరిష్కరించాలని, ప్లాట్‌ఫామ్‌ల మధ్య ఇంటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. సైన్‌బోర్డులు, డిస్‌ప్లే బోర్డులు ముదురు రంగుతో ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేషన్ చుట్టూ ఉన్న రైల్వే భూమిలో కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్లాట్‌ఫామ్ ఒకటి వద్ద ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ప్లాట్‌ఫామ్‌ల వైపు ఉన్న పార్కింగ్ ప్రదేశాల్లో షెల్టర్లు నిర్మించాలని ప్రజా సంఘాల నాయకులు ఈశ్వర్, మూర్తి, వి.జాషువా రైల్వే అధికారులను కోరారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ లక్ష్మీనారాయణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలను ఉధృతం చేయాలి



మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఎం ఎంపీ రాధాకృష్ణన్

ఉక్కునగరం: ప్రభుత్వ రంగ పరిశ్రమల (పీఎస్‌యూ) రక్షణ కోసం కార్మిక వర్గం సమరశీల ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సీపీఎం పార్లమెంట్ సభ్యులు కె. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం గురజాడ కళాక్షేత్రంలో 'ప్రభుత్వ రంగ పరిశ్రమలు - ఉపాధి - కార్మిక సమస్యలు' అనే అంశంపై నిర్వహించిన మహాసభలో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీఎస్‌యూలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కార్మిక వర్గం నిరంతరం పోరాటాలు చేయడం వల్లే అది ఇంకా ప్రభుత్వ రంగంలో కొనసాగుతోందన్నారు. పార్లమెంట్‌లో ఈ పోరాట గళాన్ని వినిపిస్తానని హామీ ఇచ్చారు. కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డీవీఎస్ రెడ్డి అన్నారు. పోరాటం వల్లే కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పేర్కొన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. జగ్గునాయుడు, ఆర్‌ఎస్వీ కుమార్, స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల వంటా-వార్పు



సహపంక్తి భోజనాలు చేస్తున్న కార్మికులు

అగనంపూడి: దువ్వాడలోని సినర్జీస్ కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు జీతాలు చెల్లించకుండా తాత్సారం చేయడాన్ని నిరసిస్తూ వారం రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వారు 'వంటా-వార్పు' కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, తమ అర్ధాకలిని తెలియజేస్తూ కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. నెలన్నర క్రితం సమ్మె చేసినప్పుడు కేవలం ఒక నెల జీతం బకాయిలు మాత్రమే చెల్లించారని కార్మికులు తెలిపారు. మరో వారంలో రెండు నెలల జీతాలు చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోకపోవడంతోనే మళ్లీ సమ్మె చేయాల్సి వచ్చిందని వారు ఆరోపించారు.బకాయి ఉన్న ఆరు నెలల జీతాలను చెల్లించే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపేవరకు ఉద్యమం

- ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం
- కోటి సంతకాలతో ప్రభుత్వానికి కనువిప్పు
- గాజువాకలో సంతకాల సేకరణలో పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్



సంతకాలు చేయిస్తున్న తైనాల, దేవన్‌రెడ్డి తదితరులు



సంతకాల సేకరణ ప్రతులను వార్డు నాయకులకు అందజేస్తున్న తైనాల, దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపేవరకు ఉద్యమం కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తైనాల విజయ్ కుమార్ చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ స్థానిక 67వ వార్డులో కోటీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతులు తీసుకొచ్చి ఐదు మెడికల్ కళాశాలలను పూర్తి చేశారన్నారు. రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తే మిగిలిన కళాశాలలు కూడా పూర్తవుతాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి వెయ్యి కోట్లు ఖర్చు చేసినా ఐదేళ్లలో కళాశాలలు మొత్తం పూర్తయితే అందుబాటులోకి వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పీపీపీ పేరిట మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడానికి పూనుకోవడం దారుణమన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే మెడిసిన్ చదవాలనుకున్న పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఎట్టి పరిస్థితుల్లోను డబ్బులు చెల్లించలేని విద్యార్థులకు సీట్లు కేటాయించవని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా కోటి సంతకాల ఉద్యమం కొనసాగుతుందన్నారు. సమన్వయకర్త దేవన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న 45 రోజులపాటు పార్టీ శ్రేణులు, నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కోరారు. కార్పొరేటర్లకు, వార్డు అధ్యక్షులకు సంతకాల సేకరణ ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు గుడివాడ లతీష్, పల్లా చినతల్లి, కొయ్య భారతి, పూర్ణానంద శర్మ, పల్లా సురేష్‌కుమార్, మంత్రి శంకరనారాయణ, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, మద్దాల అప్పారావు, సంగ్రాన సూకరాజు, శ్రీనివాసరావు, మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, ఎస్.ఎం.డి. గౌస్, అచ్చయ్యనాయుడు, చిత్రాడ వెంకట రమణ, ఎన్నేటి రమణ, రోజారాణి, కటికల కల్పన, గొందేశి వెంకట రమణారెడ్డి, రామలక్ష్మి, ఈశ్వరి, మునిషా బేగం, సత్యవతి, ఉమ, అన్నపూర్ణ, సూర్య, లక్ష్మి, కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడి ఉక్కు నిర్వాసితుల సొసైటీ ఎన్నికలపై అనుమానాలు

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఉక్కు నిర్వాసితుల హార్టికల్చర్ సొసైటీ ఎన్నికల నిర్వహణపై ప్రస్తుతం రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం, తాజాగా కొంతమంది సభ్యులు వివరాలు సేకరిస్తుండటంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఉక్కు కర్మాగారం నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉపాధి కోసం 1996లో ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. గతంలో కర్మాగారానికి సంబంధించిన మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణ టెండర్లలో సొసైటీకి ప్రాధాన్యత ఉండేది. అయితే చివరిసారిగా 2018లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలక వర్గం కాలపరిమితి 2023తో ముగిసింది.ఆ తర్వాత ఎన్నికల నిర్వహణకు సభ్యుల సంఖ్యపై భిన్నాభిప్రాయాలు రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఉక్కు భూసేకరణ విభాగం 724 మంది మాత్రమే సభ్యులు ఉన్నారని పేర్కొనగా, కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీని కారణంగా సొసైటీ టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. తాజాగా కొంతమంది సభ్యుల వివరాలు సేకరిస్తుండటంతో సొసైటీలో అలజడి మొదలైంది. కొందరు సభ్యుల సంఖ్యపై స్పష్టత కావాలని కోరుతుండగా, మరికొందరు భూసేకరణ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతున్నారు. ఈ గందరగోళం మధ్య అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

సభ్యుల వివరాలు సేకరిస్తున్నాం

సభ్యులవివరాలు పూర్తి స్థాయిలో సేకరిస్తాం. అన్ని ఆధారాలతో సరిచూసిన తరువాత సభ్యుల జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తాం. కలెక్టర్ కార్యలయం నుంచి అనుమతి వచ్చిన తరువాత జాబితా ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తాం . 20 ఏళ్ల క్రితం స్థాపించిన సొసైటీ కావడం వలన సభ్యుల సంఖ్య మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్లే వివరాలు సేకరిస్తున్నాం.

-కె.శ్యామల, అసిస్టెంట్ డైరెక్టర్, హార్టికల్చర్ విభాగం, విశాఖ

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న స్థానికులు

గాజువాక : 71వ వార్డు శ్రీరామ్‌నగర్, దిబ్బపాలెంలలో గల సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద గ్రౌండ్‌లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను స్థానికులు శ్రమదానం చేసి తొలగించారు. మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు ఆధ్వర్యంలో స్థానికులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఏపుగా పెరిగిపోవడంవల్ల విష పురుగులు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. కొంతమంది ఆకతాయిలు రాత్రి పూట మద్యం సేవించి ఖాళీ సీసాలను ఇక్కడి గ్రౌండ్‌లో పడేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెట్టడంతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు నెట్టిమి నారాయణరావు, బొండా అప్పారావు, పాలిశెట్టి లక్ష్మణ్, కందుల గురునాథరావు, దొడ్డి చిన్న, నామాల అప్పారావు పాల్గొన్నారు.

జోరువానలోనూ ఉపాధ్యాయులు నిరసన



ఉక్కు తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయాన్ని మూసివేయడాన్ని నిరసిస్తూ ఆ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం కణితి జంక్షన్ కూడలి వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద జోరు వానలోనూ ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమకు మార్చి నెల నుంచి జీతాలు చెల్లించలేదని, దీనివల్ల తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు యాజమాన్యం పాఠశాలను తెరిపించాలని, లేదంటే రాష్ట్ర ప్రభుత్వానికి నడపాలని లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు సర్వీసు చేసిన తమకు ఉద్యోగం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అనితతో పాటు సత్యం , మధుసూదన్, శ్రీనివాస్, నాగవల్లి, జ్యోతి, మణి, రెజీనా, సుధ, శోభ, జయ, శేషమణి, మేరీ సుగుణ, సుశీల, వెంకటరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.